# అపవాదు

తన నలుగురు మిత్రులూ ఆనాడు మధ్యాహ్నం లంచ్ టైంలో ఫలాహారాలు చేసి ఆఫీసు కాంటీన్‌లో టీలు కాఫీలు సేవిస్తూవుండగా, రామచంద్రమూర్తి హడావిడిగా వచ్చాడు. "మిమ్మల్ని వొకసంగతి అడగడానికి వొచ్చారా," అన్నాడు.

"ఆగవోయ్," అన్నాడు రాజేశ్వరరావు

"అర్జంటు పనిరా," అన్నాడు మరాచంద్రమూర్తి.

"మధ్య నీగోలేమిటిరా? పానకంలో పుడక లాగా," అన్నాడు రంగనాధం.

"కనకవల్లి ఎవ్వడితో లేచిపోయిందో తేల్చుకోలేక మేం చస్తుంటే," అని పూర్తి చేశాడు రాజేశ్వరరావు.

"ఇంతకీ ఆమె ఎవడితోనో వొకడితో లేచిపోయిందన్న సంగతి నిక్కచ్చిగా తెలిసిందా?" అని ప్రశ్నించాడు రంగారావు. మిత్రుల్లో ఏ ఒకరినీ ఉద్దేశించకుండా.

"పాపం! మన రంగారావు కనకవల్లి లేచిపోయిందన్న విషయాన్ని యిప్పటికీ నమ్మలేక పోతున్నాడు" అన్నాడు విశ్వేశ్వరరావు, ఒక్క రంగారావు వేపు తప్ప మిగిలిన మిత్రులవేపు కొంటెగా చూస్తో.

"రంగారావు నమ్మక పోవడానికీ, కనకవల్లి లేచిపోవడానికీ ఏదో బాదరాయణ సంబంధం వుందన్న మాట" అన్నాడు రాజేశ్వరరావు పైకి ఆలోచిస్తున్న ధోరణిలో.

"ఎంత అమాయకుడివిరా? ఆ సంబంధమేమిటో నీకు తెలియదా?" అని ప్రశ్నించాడు రాజేశ్వర రావుని, రంగనాథం సూటిగా.

"మొన్ననే వాడు ప్రివిలేజ్ లీవునించి తిరిగి వచ్చాడు. ఇంతలోకే వాడికెల్లా తెలుస్తుందిరా?" అన్నాడు విశ్వేశ్వరరావు రాజేశ్వరరావుకి అడ్డుపడుతో.

"మొన్ననే వాడు ప్రివిలేజ్ లీవు నించి తిరిగివచ్చిన విషయం నాకు తెలి

భాస్కరభట్ల కృష్ణారావు

యనిదికాదు — మొన్న అంటే రెండు రోజులు — అంటే కాస్తాకూస్తా టైమ్ కాదు. నలభై ఎనిమిది గంటలు — ఈ నలభై ఎనిమిదిగంటల్లోకూడా, యిల్లాంటి విషయాలు వాడి చెవినిపడకండా వుంటా యంటే, నేను నమ్మలేక పోతున్నాను" అన్నాడు రంగనాథం జవాబుగా.

"ఆ నలభై ఎనిమిది గంటల్లో కూడా రాజేశ్వరరావు ముందు కనకవల్లి ప్రసక్తే వచ్చి వుండక పోవచ్చు." అన్నాడు విశ్వేశ్వరరావు. జవాబుకి జవాబుగా.

"ఇంతకీ ఆ బాదరాయణసంబంధం ఏమిటో ఎవ్వరూ చెప్పారు కారేం"అని తన ప్రశ్నని రెట్టించాడు రాజేశ్వరరావు.

"ఏముందీ. మొన్న మొన్నటివరకూ మన రంగారావు కనకవల్లితో ఏదో రొమాన్సు వెలగబెట్టాడు. తనతో రొమాన్సు నడుపుతూ, ఆ అమ్మాయి ఎవడితోనో లేచిపోయిందంటే వాడు నమ్మలేక పోతున్నాడు" అన్నాడు రంగనాథం.

"మనవాడినోట్లో గడ్డకొట్టి కనకవల్లి ఎవడితోనో లేచిపోయిం దన్నమాట" అన్నాడు విశ్వేశ్వరరావు. ఉండబట్టలేక.

"ఇంకా నీకు సందేహ మెందుకు? దాని పినతండ్రి ఎవడోవచ్చి. అది లేచి పోయిందని చెప్పి, అదిపెట్టిన పది రోజుల శలవు కాన్సిల్‌చేసి, దానికి వ్యతిరేకంగా డిసిప్లినరీ యాక్షన్ తీసుకో వలసిందిగా నేడు డైరెక్టర్‌ని కోరాడు" అన్నాడు ఆ సెక్షన్ సూపరిన్‌టెన్‌డెంటు రంగనాథం.

"ఎవడో పినతండ్రి నని వచ్చి కంప్లేంట్ చేస్తే, డిసిప్లినరీ యాక్షన్ తీసు కోవడమే?'' అని విశ్వేశ్వరరావు తన ఆక్షేపణని ప్రకటించాడు.

"కనకవల్లికి తండ్రి లేడట — పిన తండ్రే లీగల్ గార్డియన్‌అట. స్వయంగా లీగల్ గార్డియనే వచ్చి కంప్లేంట్ చేసి నప్పుడు, డైరెక్టర్ మాత్రం చర్యతీసు కోకుండా ఎల్లావుండ గలడు?" అన్నాడు రంగనాథం, ప్రతివాదిస్థానంలో నిలిచి.

''ఇంతకీ డిసిప్లినరీ యాక్షన్ తీసు కోవడానికి నిశ్చయించినట్లేనా ?" అని అడిగాడు. ఇంకో సెక్షన్‌లో పనిచేస్తున్న రంగారావు బేలగా.

"ఆం దాదాపు నిశ్చయించినట్లే — కాని నీవు వద్దంటే డిసిప్లినరీ యాక్షన్ తీసు కోవడం మానుకుంటాను'' అన్నాడు రంగనాథం కొంటెగా.

దానికి ఒక్క రంగారావు తప్ప, మిగిలిన వాళ్ళంతా గొల్లుమన్నారు.

"పాపం, దానిమీద వీడి మనస్సు ఇంకా పీకుతున్నదిరా — పోనీ ఈ సారికి మానేసెయ్యి. ఇంకొకసారి కనకవల్లి పోవడం జరిగితే. అప్పుడు డిసిప్లినరీ యాక్షన్ తీసుకుందురుగాని'' అన్నాడు

విశ్వేశ్వరరావు, రంగనాథంతో, అతన్ని బతిమిలాడుతున్న ధోరణిలో.

తిరిగి మిత్రులంతా గొల్లుమన్నారు.

"కనకపల్లి చాలా మంచిది. అనవసరంగా మీరు ఆమెపైన నీలాపనింద మోపుతున్నారు. పైగా ఆమె యింతటి సాహసకృత్యాన్ని తలపెట్టిందంటే నేను నమ్మలేక పోతున్నాను" అన్నాడు రంగారావు ఏమీతోచక.

"తను ప్రేమించిన స్త్రీ చెడ్డదని తెలిస్తే. నీకేమిటి. ఎవరికైనా మనస్సు ఒప్పుకోదు" అని విశ్వేశ్వరరావు ఉపశమన వాక్యాలు పలికాడు రంగారావుని ఉద్దేశించి.

"రంగనాథం ఏమనుకున్నా సరే. తొందరపడి కనకపల్లికి వ్యతిరేకంగా చర్య తీసుకోవడం మంచిది కాదని మాత్రం, నేను చెవుతున్నాను" అన్నాడు రంగారావు, రంగనాథం వేపు కాక, ఇంక ఎటోచూస్తో.

"నిజమే. తొందరపడి కనకపల్లికి అపకారం చేయడం, మంచిదికాదని నా అభిప్రాయంకూడా" అన్నాడు రాజేశ్వరరావు.

"అసలు ఇందులో మనందరం ఆలోచించ వలసిన ముఖ్యమైన విషయం వొకటి వుంది" అన్నాడు రంగారావు.

"ఏమిటది" అని అడిగాడు, రంగనాథం.



"మేము పెద్దపెద్ద రచయితల కథలే ప్రింటు చేస్తామండి."

"అయితే మరీ మంచిదండి, నా పేరు తిక్కన"

"కనకపల్లి లేచి పోయిందే అనుకుందాం. ఆమె మంచిది కాదే అనుకుందాం. అయితే ఆమె వ్యక్తిగత జీవితానికీ ఆఫీసు జీవితానికీ ఏమి సంబంధం? ఏమి సంబంధం అని డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవటం? అలా చెయ్యటం మొదలుపెడితే మన ఉద్యోగాలు మాత్రం నిలుస్తాయా?" అన్నాడు రంగారావు.

ఈ ఆర్గ్యుమెంటు అందరికీ నచ్చింది. అందరూ వెళ్ళి ఈ విషయం డైరెక్టరుకి నచ్చచెప్పాలనుకున్నారు. అలాగే చెప్పారు.

మొత్తానికి కనకపల్లి పట్ల అందరూ సానుభూతి చూపినా, ఆమె తప్పుపని

చేసింవని నిశ్చయించు కున్నారు. రంగా రావు మాత్రం నమ్మలేక నమ్మలేక నమ్మాడు.

డైరెక్టర్ గదిలోనుంచి బయటకు రాగానే రామచంద్రమూర్తి, "ఇప్పటి కైనా నే నడగదలచిన సంగతి అడగ నిస్తారా?" అని ప్రశ్నించాడు.

"మధ్య నీగో లేమిటిరా, రామా యణంలో పిడకలాట లాగా," అని మళ్ళీ మందలించాడు రంగనాథం.

పదిరోజులకి కనకవల్లి తిరిగి ఆఫీసుకి వచ్చింది. ఆమెకు తాము డైరెక్టరు గారితో చెప్పి వొప్పించిన సంగతులు నివేదించి, తమ అభిప్రాయాలు ఎంత అభ్యుదయకరమైనవో వివరించాలనే ఉద్దేశంతో మిత్రులంతా ఆమెచుట్టూ గుమిగూడారు. ఒక్కొక్కరూ, వొకరి కంటే వొకరు ముందుకు వచ్చి జరిగిన సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పారు. "ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలకూ, ఆఫీసు జీవితాలకూ సంబంధం పెట్ట గూడదని మేము డైరెక్టరు గారికి నచ్చ జెప్పాం. వారు మావాదం అంగీక రించారు. ఇకనీ కే ఇబ్బందీ రాదు." అన్నారు ఎవ్వరికి వారు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"అయితే నేను లేచిపోయా ననే మీరు నిర్ధారణ చేసుకున్నా రన్నమాట!" అని ఇంత మొహం చేసుకొని అడిగింది కనకవల్లి.

మిత్రులు, ఏంచెప్పాలో తోచక, వొకరి మొహం ఒకరు తిలకిస్తూ నిల డ్డారు. అప్పుడామె తన కథ చెప్పింది.

ఆమె తన మేనబావను వివాహం చేసుకుందట. ఆమే అంతకు ముందు తన జీతంతో పినతండ్రి కుటుంబాన్ని సాకుతూ వుందట. తను వివాహం చేసుకుంటే తమకుటుంబానికి జీవనా ధారం తప్పి పోతుందనే స్వార్థం కొద్దీ, ఆమె పినతండ్రి ఆమెపై నీలాపనింద మోపి, డైరెక్టరుతో కంప్లైట్ చేశాడట. ఉద్యోగం లేకుండా చేస్తేనైనా తన మాట వింటుందేమో నని ఆమె పిన తండ్రి ఆశ అట!

అలా చెప్పుకు పోయింది కనకవల్లి. తనను గురించి నీచంగా ఆలోచించి నందుకు చాలా ఖిన్నురాలైంది. అప కారం చెయ్యదలచిన వారికీ, సహాయం చెయ్యదలచిన వారికీ అందరికీ ఈ సంఘంలో అపవాదే పునాది అయి నందుకు కంటతడి పెట్టుకుంది.

ఆమెమాటలు విని మిత్రులందరూ ఎవ్వరికి వారు నెమ్మదిగా జారుకున్నారు.

రంగారావు ఎవరూలేకుండా చూచి లెంపలు వేసుకున్నాడు. ★